keratam.in www.digital.keratam.in
కెరటం
గురువారం, 04 మే 2023 పేజీలు 08



## సరిహద్దుల్లో జోరుగా

# కోడి పందేలు..!

- లక్షల్లో బెట్టింగులు.. చేతులు మారుతున్న వైనం.
- కత్తి కడితే లక్షలు చెల్లించాల్సిందే..
- పట్టించుకోని పోలీసు యంత్రాంగం.
- భయంతో వణుకుతున్న సరిహద్దు ప్రాంత వాసులు.
- కట్టడి చేయాలంటున్న ఏజెన్సీ వాసులు..



**శామ్, మే03(కెరటం ప్రతినిధి)**

భద్రాచలానికి సమీపంలోని సరిహద్దు అటవీ ప్రాంతాల్లో జోరుగా కోడి పందేలు సాగుతున్నాయి. దుమ్ము గూడెం మండలం మారాయిగూడెం చిట్టచివరి ప్రాంతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు సరిహద్దున ఉండటంతో అటువైపు అధికారులెవరూ కన్నెత్తి చూడటం లేదు. దీంతో నిర్వాహకులు యథేచ్ఛగా కోడి పందేలు, జూదం నిర్వహిస్తున్నారు. వారంలో రెండు రోజులు, ఎక్కువగా గురు, ఆదివారాల్లో వీటిని నిర్వహిస్తున్నా రు. భద్రాద్రి, ఖమ్మం జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పందెంరాయుళ్లు తరలివస్తున్నా రు. ఎక్కువగా ఖమ్మం జిల్లాలో ని సత్తుపల్లి, భద్రాద్రి జిల్లాలోని దమ్మపేట, అశ్వారావుపేట పశ్చిమ గోదావరి జిల్లాలోని జంగారెడ్డిగూడెం, చింతలపూడి తూర్పుగోదావరి, విశాఖ పట్నం జిల్లాల నుంచి ఇక్కడ నిర్వహించే కోడిపందేలలో పాల్గొనేందుకు వస్తున్నారు. భద్రాద్రి, ఖమ్మం, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చే వారంతా భద్రాచలం మీదుగా, తూర్పు, విశాఖపట్నం నుంచి వచ్చే వారు రంప చోడవం ఘాట్‌రోడ్ నుంచి చింతూరు మీదగా వాహనాల్లో వస్తున్నారు. ఇక్కడ కోడిపందేలు నిర్వహించే రోజుల్లో ఆయా రూట్‌లలో కార్ల దండు కనిపిస్తుంది. భద్రాచలం ప్రాంతానికి యాత్రికులు, భక్తులు ఎక్కువగా వాహనాల్లోనే వస్తూ ఉంటారు. ఈ క్రమంలో తనిఖీలు లేకుండానే పందెంరాయుళ్లు దర్జాగా స్థావరాలకు చేరుకుంటున్నారు.

**కత్తి కడితే లక్షలూ పడాల్సిందే..**

కోడి పందేలు కొందరు ప్రముఖల కనుసన్నల్లోనే సాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భద్రాచలానికి సమీపంలో మూడు చోట్ల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోగా, ఎక్కడ నిర్వహిస్తారనేది పందెం రాయుళ్లకు ముందుగానే సమాచారం ఉంటుంది. స్థావరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు కూడా ఉంటాయి. బిర్రులోకి వెళ్లే ప్రతీ ఒక్కరి నుంచి రూ. 1000 నుండి రూ.1500 వరకు నిర్వాహకులు వసూళ్లు చేస్తున్నారు. పందెం నిర్వహించే రోజున ఎంత మంది వచ్చినప్పటికీ, ఐదు వందల మంది పట్టే రీతిలో బిర్రు తయారు చేస్తున్నారు. ఈ లెక్కన ఒక రోజుకు కత్తుల కట్టిన చోట రూ.10 లక్షల వరకు వసూళ్లవుతాయి. పందెం కాసే డబ్బుల్లోంచి కూడా 5 శాతం కమీషన్ నిర్వాహకులకు ఇచ్చేలా తగిన ఒప్పందాలు ఉంటాయి.

**జూదంకు సప'రేటు'**

మూడు ముక్కల పేకాట, లోనబయట వంటి జూదం నిర్వహించుకునేందుకు నిర్వాహకులకు ముందస్తుగా డబ్బులు చెల్లించాలి. కోడిపందేలు నిర్వహించే చోట మద్యం విక్రయాలకు సంబంధించిన దుకాణాలు కూడా వెలుస్తున్నాయి. వీటిని పెట్టుకునేందుకు నిర్వాహకులకు డబ్బులు చెల్లించి ముందుగానే ఒప్పందం చేసుకోవాలి. ఈ రీతిన కోడి పందేల నిర్వహణకు లక్షలాది రూపాయలను నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. పందేలు జరిగే రోజుల్లో తనిఖీలు చేయకుండా సరిహద్దు ప్రాంతాల్లోని ఒక్కో స్టేషన్‌కు భారీ ముడుపులు ఇచ్చేలా ఒప్పందాలు జరిగాయనే విమర్శలు గుప్పుమంటున్నాయి. వీటి జోలికి వెళ్లకుండా ఉండేలా కొన్ని వర్గాలకు కూడా డబ్బులు పంచుతున్నారనే ప్రచారం ఉంది. రీసెంటుగా మావోయిస్టులు బాంబు బ్లాస్టింగ్ చేసి పది మంది జవాన్లను పొట్టన పెట్టుకున్నారు. అందుకే మావోయిస్టుల కదలికలు కూడా బాగానే ఉండ టంతో దీని వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. పోలీసు శాఖ ఉన్నతాధికారులు దీనిపై ముందుగానే దృష్టి సారించి కట్టడి చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



## డా.జీఎస్ఆర్ ట్రస్ట్ సేవలు

## మరింత విస్తృతం..

- గ్రామ కమిటీల ద్వారా చిట్ట చివరి గ్రామానికి చేరేవిధంగా ప్రణాళికలు
- సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణ దిశగా డా.జీ ఎస్ ఆర్ ట్రస్ట్
- కొనసాగుతున్న ట్రస్ట్ సభ్యత్వ నమోదు కార్యక్రమం
- సభ్యులకు ఐదు లక్షల ప్రమాద బీమా పథకం, స్వయం ఉపాధి కల్పన

2



## ఏప్రిల్‌లో 108 శాతం

## బొగ్గు రవాణా

- గతేడాది ఇదే నెలలో జరిపిన రవాణాపై 5.7 శాతం వృద్ధి
- ఏప్రిల్ నెలలో 12.6 శాతం వృద్ధితో 422 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు
- ప్రతిరోజు 15.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలి
- అన్ని ఏరియాలో జనరల్ మేనేజర్ల సమీక్ష సమావేశంలో సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశం

3

## జేపీఎస్‌లకు న్యాయం జరిగే వరకు

## అండగా ఉంటాం



3

## తడిసిన ప్రతిగింజను ప్రభుత్వం

## కొనుగోలు చేయాలి

- తేమతో సాకుగా చూపి రైతులకు నష్టం చేయొద్దు
- తేమ శాతంతో నిమిత్తం లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- ములకలపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సిపిఐ రాష్ట్ర బృందం

3

## శ్రమశక్తి అవార్డు గ్రహీత

# స్వామికి ఘన సత్కారం

శామ్, మే03(కెరటం ప్రతినిధి)

శ్రమశక్తి అవార్డు గ్రహీత వనచర్ల వి.వి.ఎన్.ఎస్ స్వామిని బుధవారం ఘన సత్కారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాంగ్రెస్ కంపెనీ లిమిటెడ్ ట్రాన్స్పోర్ట్ జీఎం దామోదర్ మాట్లాడుతూ వనచర్ల వి.వి.ఎన్.ఎస్ స్వామి తన ఆధ్వర్యంలో పనిచేయడం చాలా సంతోషదాయకం ఈ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇవ్వబడు శ్రమశక్తి అవార్డు వనచర్ల వి.వి.ఎన్ఎస్ స్వామికి దక్కడం ఆయన శ్రమకు తగ్గ ఫలితం అన్నారు ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ప్రతి డ్రైవర్లను తన కుటుంబ సభ్యులుగా భావించి సొంత కుటుంబ సభ్యులైన చేస్తారో లేదో కానీ కష్టం వచ్చినప్పుడు నేనున్నా అనే మనస్తత్వం గల వ్యక్తిత్వం గల వాడని, డిపార్ట్మెంట్లోనే కాదు ఎవరికి ఏ కష్టం వచ్చినా తన పర్మిషన్ తీసుకుని అంకితభావంతో పనిచేసే వ్యక్తి అని, అలాంటి వ్యక్తి మా ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ నందు ఉండడం మా ట్రాన్స్పోర్ట్‌కి గర్వకారణం అన్నారు. డీజీఎం మెయిన్ వర్క్‌షాప్ రాజి కుమార్ మాట్లాడుతూ స్వామి సింగ రేణి జాయినింగ్ గేట్ నుంచి తనకు సుపరిచితులని, ఇప్పుడు వరకు సింగరేణి నందు 8 డిపార్ట్మెంట్లలో పనిచేసే ఉన్నారని, ప్రతిచోట మేనేజ్మెంట్ మన్ననలు పొంది ఉన్నారని, తన కుటుంబం గురించి బాగా తెలుసు అని, తన కుటుంబంలో తానే పెద్దదిక్కై కుటుంబ బాధ్యతలతో పాటు ప్రతి వర్కర్‌తో



స్నేహపూరిత వాతావరణంలో తన వృత్తిని నిర్వర్తిస్తూ ముందుకు సాగుతున్న స్వామికి శ్రమశక్తి అవార్డు రావడం చాలా అభినందదాయకం అని అన్నారు. ఇలానే మునుముందు మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని కొనియాడారు.

దీనిలో భాగంగా ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ నందు డ్రైవర్స్ మరియు ప్రైవేట్ డ్రైవర్స్ ఆటో వర్క్ షాప్ నుంచి వర్కర్స్ పాల్గొని వనచర్ల స్వామికి శు భాకాంక్షలు తెలియజేయడం జరిగింది. అవార్డు గ్రహీత స్వామి మాట్లాడుతూ జీఎం దామోదర్‌కి, డీజీఎం మెయిన్ వర్క్‌షాప్ రాజీవ్ కుమార్‌కి, ఆటో వర్క్‌షాప్ రాంశేషయ్యకి ఈ సన్మానంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్పోర్ట్ జీఎం దామోదర్ పని యందు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా కూడా అందిస్తూ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ముందుకు నడిపిస్తున్నారని, కోవిడ్ అత్యవసర సమయంలో సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి టీజీపీకేఎస్ సంఘం తరఫునుంచి లారీని కోరగా లారీ తెప్పిచ్చారని, కొత్తగూడెం శాసనసభ్యులు వనమా వెంకటేశ్వర ఆశీస్సులతో, నిత్యం ప్రజల సేవలో మాకు అండగా ఉండి మా ముందుండి నడిపే రాఘవన్నకి, కొత్తగూడెం చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మికి హయాంలో ఈ అవార్డు రావడం ఆనందదాయకం అన్నారు.


## జేపీఎస్‌లకు న్యాయం జరిగే వరకు

# అండగా ఉంటాం

- జేపీఎస్,ఓపీఎస్‌లను పర్మినెంట్ చేయాలి
- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

శామ్, మే03(కెరటం ప్రతినిధి)

జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు,ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు న్యాయం జరిగే వరకు బీఎస్పీ అండగా ఉంటుందని,వారిని వెంటనే పర్మినెంట్ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద జేపీఎస్,ఓపీఎస్ లు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడుతూ ప్రభుత్వం పల్లెప్రగతి అని కార్యదర్శులతో గొడ్డు చాకిరీ చేపించుకొని గ్రామ పంచాయతీలకు జాతీయ స్థాయి



అవార్డులు వస్తే తమ గొప్పని చెప్పుకుంటున్నా ప్రభుత్వం క్షేత్రస్థాయి లో పని చేసిన కార్యదర్శులను విస్మరంచడం సరైంది కాదన్నారు. 45 మంది ప్రమాదాలు జరిగి చనిపోయారని ఉద్యోగ భద్రత లేకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని వారిని ఎవరు ఆదుకుంటారని ప్రశ్నించారు.పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని అటువంటి పల్లెల్లో ఉండే కార్యనిర్వాహక అధికారి బాగుండాలి కానీ వాళ్ళని రోడ్డు మీద కూర్చునేలా చేసిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు.



కరోనా సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్లుగా పనిచేసిన వారిని ప్రభుత్వం విస్మరం చడం సరైంది కాదన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి జూనియర్ పంచాయతీ కార్యద ర్శులను, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు పర్మి నెంట్ చేయాలని లేని పక్షంలో వారి ఆందోళనలకు బీఎస్పీ సంపూర్ణ మద్దతు ఉంటుం దన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున రావు, సాయి, చెనిగారపు నిరంజన్ కుమార్,అల్లకొండ శరత్, కోళ్లపూడి ప్రవీణ్ కుమార్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## డా.జీఎస్ఆర్ ట్రస్ట్ సేవలు

# మరింత విస్తృతం..

- గ్రామ కమిటీల ద్వారా చిట్ట చివరి గ్రామానికి చేరేవిధంగా ప్రణాళికలు
- సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణ దిశగా డా.జీ ఎస్ ఆర్ ట్రస్ట్
- కొనసాగుతున్న ట్రస్ట్ సభ్యత్వ నమోదు కార్యక్రమం
- సభ్యులకు ఐదు లక్షల ప్రమాద బీమా పథకం, స్వయం ఉపాధి కల్పన



శామ్, మే03(కెరటం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో డా. జీ ఎస్ ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను గ్రామ గ్రామానికీ విస్తరించేందుకు ట్రస్ట్ కార్యాచరణ సిద్ధం చేస్తుంది. ఇందులో భగంగా గ్రామ కమిటీలు ఏర్పాటు చేయటానికి సన్నద్ధమవుతోంది. ఇదివరకే సభ్యత్వ నమోదు కార్రమం చేపట్టిన ట్రస్ట్, పెద్దయెత్తున తిరిగివచ్చిన సభ్యత్వ నమోదు పత్రాల పరిశీలన పూర్తి చేసి గ్రామ కమిటీలు ఏర్పాటు చేయటం ద్వారా చిట్ట చివరి గ్రామానికి ట్రస్ట్ సేవా కార్యక్రమాలు అందేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. ట్రస్ట్ సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే ఐదు లక్షల ప్రమాద బీమా, మహిళలకు, ముఖ్యంగా గృహిణులకు స్వయం ఉపాధి కల్పన వంటి సౌకర్యాలు అందిస్తుంది. సమాజ సేవ చేయాలనే ఆసక్తిగల యువతి, యువకులు గ్రామ ప్రజలు సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి, జిల్లాలో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేలా రూపొందించామని డా. గడల శ్రీనివాసరావు తెలిపారు. గ్రామ స్థాయిలో యువకులు, ఉత్సాహవంతులు, అనుభవజ్ఞులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని సమాజ సేవలో సహకరించాలని వారు పిలుపునిచ్చారు.



## పేదింటి ఆడపిల్లలకు కళ్యాణ లక్ష్మి పథకం ఒక వరం

- కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు
- కొత్తగూడెం పట్టణ మున్సిపాలిటీలో 37 మంది కళ్యాణ్ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

శామ్, మే03(కెరటం ప్రతినిధి)

పేదింటి ఆడపిల్లలకు కళ్యాణ లక్ష్మి పథకం ఒక వరం అని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ వివిధ వార్డులలో 37 మంది కళ్యాణ్ లక్ష్మీ లబ్ధిదారులకు సుమారు 3,70,492 రూపాయల చెక్కులను కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తన చేతులు మీదుగా స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమా మాట్లాడుతూ తింటే గారెలే తినాలి కంటే కూతుర్నే కనాలి అని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడపిల్లలకు పెద్దన్నగా ఈ కళ్యాణ లక్ష్మి పథకం ప్రవేశపెట్టారని, నియోజకవర్గంలో ఇప్పటివరకు 30 కోట్ల రూపాయల చెక్కులను కళ్యాణ్ లక్ష్మి లబ్ధిదారులకు అందచేసానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఎంఆర్వో, కౌన్సిలర్లు కోలాపూరి ధర్మరాజు, పరమేష్ యాదవ్, మోరే రూప బిఆర్ఎస్ నాయకులు ఎం.ఏ రజాక్, రావి రాంబాబు, యూసుఫ్, కొండ స్వామి, సుందర్ రాజ్, రెవెన్యూ సిబ్బంది, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ఏప్రిల్‌లో 108 శాతం బొగ్గు రవాణా

- గతేడాది ఇదే నెలలో జరిపిన రవాణాపై 5.7 శాతం వృద్ధి
- ఏప్రిల్ నెలలో 12.6 శాతం వృద్ధితో 422 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు
- ఈనెలలో రోజుకు 2.2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.26 లక్షల టన్నుల రవాణా జరపాలి
- ప్రతిరోజు 15.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలి
- అన్ని ఏరియాలో జనరల్ మేనేజర్ల సమీక్ష సమావేశంలో సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశం



**శామ్, మే03(కెరటం ప్రతినిధి)**

సింగరేణి కాలరీస్ కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి నెల అయినా ఏప్రిల్ లో 60 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిపి గత ఏడాది ఇదే నెలలో జరిపిన రవాణాపై 5.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. అలాగే బొగ్గు ఉత్పత్తిలో 4.7 శాతం వృద్ధిని, ఓవర్ బర్డెన్ తొలగింపులో 12.6 శాతం వృద్ధిని సాధించింది. హైదరాబాద్ సింగరేణి భవన్ లో అన్ని ఏరియాల జనరల్ మేనేజర్ల తో నిర్వహించిన ఉత్పత్తి సమీక్ష సమావేశంలో సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ శ్రీ ఎన్.శ్రీధర్ ఈ వివరాలను వెల్లడిస్తూ మే నెలలో సాధించాల్సిన లక్ష్యాలను ఏరియాలకు నిర్దేశించారు. ఏప్రిల్ నెలలో నిర్దేశించిన 55.7 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అలాగే నిర్దేశిత 55.8 లక్షల టన్నుల బొగ్గు రవాణాకు గాను 108 శాతం తో 60 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిపామని, అలాగే నిర్దేశిత 410 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యాన్ని దాటి 102 శాతంతో 422 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించగలిగామని అభినందించారు. ఇదే ఒరవడితో మే నెలలో మరింత మెరుగుగా పనిచేసి, నిర్దేశిత లక్ష్యాలు సాధించాలని ఆయన అన్ని ఏరియాల జీఎంలను, కార్మికులను కోరారు. మే నెలలో 67.58 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని, దీని కోసం రోజుకు కనీసం 2.20 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించాలన్నారు. ఇదే నెలలో 70 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరపాలని, దీని కోసం రోజుకు కనీసం 2.26 లక్షల టన్నుల రవాణాకు సంసిద్ధం కావాలన్నారు. మే నెలలో 48.05 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలని దీనికోసం రోజుకు కనీసం 15.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించాలని నిర్దేశించారు. అన్ని ఏరియాలో కొత్త ప్రాజెక్టుల ప్రాంతానికి అవసరమైన భూ సేకరణ, ఆర్ అండ్ ఆర్ సమస్యలపై ఏరియాల్లో జనరల్ మేనేజర్లు నిరంతరాయంగా స్థానిక కలెక్టర్లు, ప్రభుత్వ అధికారులు, రెవిన్యూ అధికారులతో సంప్రదింపులు జరుపుతూ ఏ పనులు కూడా పెండింగ్ లో లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి డైరెక్టర్ ఫైనాన్స్ మరియు పా ఎన్.బలరామ్, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్.వి.కె. శ్రీనివాస్, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, అడ్వైజర్ మైనింగ్ డి.ఎన్.ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూామెంట్ జె.ఆల్విన్, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.






## తైక్వాండో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

**శామ్, మే03(కెరటం ప్రతినిధి)**

జిల్లాస్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో భాగంగా అశోక్ నగర్ కాలనీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన తైక్వాండో శిక్షణ శిబిరాన్ని బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఈ శిక్షణ శిబిరంలో పలు ప్రాంతాలకు చెందిన 40 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తైక్వాండో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, కొత్తగూడెం కోర్ట్ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ దుంద్రా రమేష్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జంజాల యాదగిరిరావు, రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రెటరీ పి.కాశీ హుస్సేన్ రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ ఏర్పాటు చేసిన టైక్వాండో శిక్షణ శిబిరాన్ని బాల, బాలికలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని నేటి కాలంలో చదువుతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు పట్ల కూడా ఆసక్తి కనబరచాలని, మనం ఆరోగ్యంగా ఉంటేనే ఏ రంగాల్లోనైనా ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని ప్రసాద్ సూచించారు .ఈ సందర్భంగా జిల్లా టైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, శిక్షకులు ఇ.మొగిలి మాట్లాడుతూ టైక్వాండో శిక్షణ శిబిరం నెల రోజుల పాటు జరుగుతుందని, ఉదయం సాయంత్రం కూడా నిర్వహిస్తామని, అందరూ శిక్షణ శిబిరంలో పాల్గొని ప్రతిభ కనబరిచిన వారికి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సర్టిఫికెట్లు అందజేస్తుందని, ప్రతి ఒక్కరు కూడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, కమల్ అడ్వకేట్స్, సదానందం, సుదర్శన్, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**శామ్, మే03(కెరటం ప్రతినిధి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ ఆఫీస్ శేషగిరి భవనంలో ఘనంగా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 64వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఆ సంఘం నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ బోయిన విజయ్ కుమార్ అధ్యక్షత వహించగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్కె నాగుల్ మీరా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐవైఎఫ్ మే 03, 1959లో ఆవిర్భావం జరుపుకోవడం జరిగిందన్నారు. ఏఐవైఎఫ్ ప్రపంచ యువజన సంఘమైన వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ డెమోక్రటిక్ యూత్ (డబ్ల్యూఎఫ్‌డీవై)లో సభ్యత్వం కలిగి ఉందన్నారు. భారతదేశంలో 143 కోట్ల జనాభాలో60 శాతం యూత్ ఉండడంతో ఉపాధి లేక అనేకమంది రోడ్డున పడ్డారని వీరికి దేశవ్యాప్తంగా ఉపాధి కలగాలంటే తక్షణమే పార్లమెంట్లో (బిఎన్ఈజిఏ) భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్‌ను చట్టం చేసి ఆమోదించి అమలుపరచాలన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం2014లో అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు చొప్పున 8 సంవత్సరాలకు 16 కోట్ల ఉద్యోగాలను యువతకు భర్తీ చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కింద నెలకు 3016 తక్షణమే విడుదల చేసి యువతను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బరిగెల భూపేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కె ఖయ్యూం, జిల్లా నాయకులు అజీజ్, రూపేష్, రసూల్ ,చింటూ, పవన్, సంతోష్, రణధీర్ , రాహుల్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



## తడిసిన ప్రతిగింజను ప్రభుత్వం

# కొనుగోలు చేయాలి

- తేమతో సాకుగా చూపి రైతులకు నష్టం చేయొద్దు
- తేమ శాతంతో నిమిత్తం లేకుండా తడిసిన ముడి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- ములకలపల్లి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సిపిఐ రాష్ట్ర బృందం



**శామ్, మే03(కెరటం ప్రతినిధి)**

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన దాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి నష్టపోయిన సమస్త రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. భద్రాది కొత్తగూడెం జిల్లా, ములకలపల్లి మండల కేంద్రంలోని దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఐ నేతల బృందం బుధవారం సందర్శించారు, రైతులను కలుసుకొని జరిగిన నష్టంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ తడిసిన దాన్యాన్ని కొనుగోలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, ఐతే క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని, దాన్యాన్ని ఆరబెట్టుకొని రావాలని సంబందిత అధికారులు నిబంధన విధిస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారని, తరచూ వర్షాలు కురుస్తుండటంతో దాన్యాన్ని ఆరబెట్టే పరిస్థితులు లేకుండా పోయాయన్నారు. 17శాతం తేమ అనే నిబందన వల్ల రైతాంగం నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. లక్షలాది ఎకరాల్లో పండించిన



వరిదాన్యం అకాల వర్షాలకు తడిసి ఇంకా కల్లాలోనే ఉందని, రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్న ఈ దాన్యాన్ని 17 శాతం నిబందను విధించకుండా కొనుగోలు చేయాలని కోరారు, అకాల వర్షాలకు వరితోపాట మొక్కజొన్న, మిర్చి, మామిడి రైతులు సైతం పూర్తిగా నష్టపోయారన్నారు. రైతులకు జరిగిన నష్టంపై కేంద్రం ప్రభుత్వం కూడా స్పందించాల్సిన అవసరం ఉందని, ఎకరాకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే పరిహారంతో నిమిత్తం లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి పరిహారం అందించాలని కోరారు. సాగుకోసం అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులు తీర్చే స్థితిలో లేక, మళ్ళి అప్పులు చేసే దైర్యం లేక రైతన్నలు గుండెనిబ్బరం కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి రైతులకు ఖచ్చితమైన హామీ ఇచ్చి నష్టపోయిన రైతుల కన్నీళు ళ కన్నీళ్ళు తుడవాలని, యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జరిగిన నష్టంపై సర్వేలు చేపట్టి త్వరితగతిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతినిధిబృందంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, రైతులు, టిఎన్ఆర్ ట్రస్ట్ కోఆర్డినేటర్ నడిపల్లి నవీన్, నరాటి రమేష్, బైరు సాయి, ఎస్కే.మౌలానా, అనుముల సాయి, గొడ్ల కొండయ్య, రాజు ,దుర్గ ప్రసాద్, వీరు నాయక్, ఏమనియల్, తదితరులు ఉన్నారు.

# గొంతెండుతున్నా పట్టించుకోరా..

- కిన్నెరసాని నీళ్ళు రాక ప్రజలు అనేక ఇబ్బందులు
- అధికారులకు పట్టని ప్రజల ఇబ్బందులు
- సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్య



**శామ్, మే03(కెరటం ప్రతినిధి)**

గొంతెండుతున్నా పట్టించుకోవడం లేదని, కిన్నెరసాని నీళ్ళు రాక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల ఇబ్బందులు అధికారులకు పట్టడం లేదని సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్య అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం స్థానిక బస్టాండ్ సెంటర్లో గల జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్య మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గం లో కిన్నేరసాని నీళ్ళు రాక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు అసలే ఎండకాలం నీళ్ళ రాకపోతే ప్రజలు ఎలా బ్రతుకుతారు ఇంత జరుగుతున్న కానీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు దానికి తోడు అధికారపార్టీ ఏంఎల్ఏ పట్టించుకోక పోవడం సిగ్గుమాలిన చర్య ప్రజల ఇబ్బందులు పట్టించుకోని ప్రతి నిధులు ఉండటం కంటే రాజీనామా చేయడం ఉత్తమం ఈ ఎండాకాలంలో ప్రజలకు నీళ్ళు రాకపోతే వారి నీళ్ళ కష్టాలు తీర్చేందుకు అధికారులు ట్యాంకర్ల సదుపాయం కల్పించాలని చిన్న పిల్లలు దాహం తో విలవిల పడుతున్నారు ముందుగా ప్రజల ఇబ్బందుల పడుతున్న నీళ్ళ బాధలు అధికారులు తీర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమములో కొత్తగుడెం పట్టణ అధ్యక్షులు బొమ్మిడి మల్లికార్జున్, చుంచుపల్లి మండల అధ్యక్షులు అంతోటి పాల్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు పల్లపు వెంకటేశ్వర్లు, నియోజకవర్గ లీగల్ సెల్ నాయకులు అరలక కర్ణకర్, లక్ష్మీదేవిపల్లి యస్సీ సెల్ అధ్యక్షులు కొప్పుల రమేష్, కాంగ్రెస్ నాయకులు వెలెటీ వెంకటేశ్వర్లు, శనగ లక్ష్మణ్, భూక్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మాల మహానాడు జిల్లా మహిళా గౌరవాధ్యక్షురాలుగా రెంటపల్లి మాధవిలత

**శామ్, మే03(కెరటం ప్రతినిధి)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం నియోజకవర్గం ,రామవరం మాల మహానాడు ఆఫీస్ నందు జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైనటువంటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాల మహానాడు అధ్యక్షులు పూల. రవీందర్ .రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా గౌరవాధ్యక్షురాలుగా రెంటపల్లి. మాధవి లతకి నియామక పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాధవి లత మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు ఈ బాధ్యత ఇచ్చినటువంటి జిల్లా అధ్యక్షులు పూల. రవీందర్‌కి కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ జిల్లాలో మహిళా మాల మహానాడు బలోపేతానికి అంబేద్కర్ ఆశయ సాధన కొరకు కృషి చేస్తానని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు బడికల .పుష్పలత, జనరల్ సెక్రెటరీ కుంచె.లావణ్య, కొత్తగూడెం నియోజకవర్గ ఉపాధ్యక్షులు పగిడిపల్లి. శ్రీకాంత్, రామవరం మలమహానాడు అధ్యక్షులు దాసరి. అశోక్, ట్రెజరర్ హరినాథ్, రాజు, సోమరాజు, మూర్తి, కృష్ణ, రాజేశ్వరరావు, కనకయ్య తదితర మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.



## సీఎం కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

**శామ్, మే03(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం పురపాలక సంఘ కార్యాలయము నందు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర్ రావు, తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖా మంత్రి కల్వకుంట తారకరామా రావు, కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు చిత్రపటములకు పాలాభిషేక కార్యక్రమమును మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, గౌరవ వార్డు సభ్యుల అద్వర్యంలో నిర్వహించడం జరగినది. తెలంగాణ రాష్ట్రములో గల అన్ని పురపాలక సంఘములలో పారిశుధ్య పనులు నిర్వహించు వర్కరులకు ప్రస్తుతము తీసుకొంటున్న వేతనముకు అదనముగా రూ. 1,000 వేతనమును పెంచుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర్ రావు ఆదేశాలు జారీచేసినందుకు గాను కొత్తగూడెం పురపాలక సంఘ కార్యలయములో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆద్వర్యంలో కల్వకుంట చంద్రశేఖర్ రావు, తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖా మంత్రి కల్వకుంట తారకరామా రావు, కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు వనమా వేంకటేశ్వర రావు చిత్రపటములకు పాలాభిషేక కార్యక్రమము నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమములో మున్సిపల్ చైర్ పర్సన్ సీతాలక్ష్మి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొలపురి ధర్మరాజు, గౌరవ వార్డు సభ్యులు బలసేట్టి సత్యభామ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రము తదుపరి కొత్తగూడెం పురపాలక సంఘ పారిశుధ్య కార్మికులు అందరూ మున్సిపల్ చైర్ పర్సన్ సీతాలక్ష్మికి శాలువాతో ఘనంగా సన్మానము చేయడం జరిగినది.

